క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చొల్లంగిలో సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్

తాళ్లరేవు: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ కోరారు. మంగళవారం ఆయన చొల్లంగి పంచాయతీలో పర్యటించి ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న రక్షిత తాగునీటిని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్ఎస్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్ర వంతెనపై అంధకారం



విద్యుద్దీపాలు లేక ఎర్ర వంతెనపై చీకటిలోనే వెళుతున్న వాహనాలు

అమలాపురం టౌన్: నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే పట్టణంలో కీలకమైన ఎర్ర వంతెనపై విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్ విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ ఈ సమస్యపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎర్ర వంతెన మీదుగా ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ మండలాల్లోని పలు గ్రామాలకు, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలతో పాటు కాకినాడకు నిత్య వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని ఆయన అన్నారు. రాత్రి సమయంలో ఈ వంతెనపై విద్యుద్దీపాలు లేక అంధకారం అలముకుంటోందని, ఒక్కోసారి రోడ్డు ప్రమాదాలు అన్నారు.

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

కాట్రేనికోన: కందికుప్ప, కాట్రేనికోన, చెయ్యేరు, కుండలేశ్వరం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షులు నూకల మూర్తి, పెసింగి రంగారావు వర్మ, త్సవటపల్లి శ్రీనివాస్, గంగుమళ్ల రవికుమార్, కార్యవర్గ సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. కాట్రేనికోన మండలంలో నిర్వహించిన పీఏసీఎస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంనకు త్సవటపల్లి నాగేంద్ర, నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు,కందికుప్ప సీతఊఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

పీఆర్టీసీ సిబ్బంది నిరసన

యానాం: పుదుచ్చేరి రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (పీఆర్టీసీ) డ్రైవర్లు, కండక్టర్లు తమ డిమాండ్ల సాధనకు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న కాంట్రాక్టు సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, 7వ వేతన సంఘ సిఫార్సులను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నేత బాలకృష్ణన్, వివిధ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర హోదా కోసం ప్రయత్నించాలి

యానాం: రాష్ట్ర హోదా సాధనలో మరింత చురుగ్గా వ్యవహరించాలని కోరుతూ మంగళవారం పలు సామాజిక సంస్థలు సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా ఇండిపెండెంట్ ఎమ్మెల్యే కుప్పుస్వామి అలియాస్ నెహ్రూ ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాలు నాయకులు సీఎంను కలిసారు. అనంతరం నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్ర హోదా అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురావాలని కోరారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాల్లో జాతీయస్థాయిలో మద్దతు కూటగట్టేందుకు ఒక ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్రహోదా అంశంపై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపర్చాలని కోరారు.

వైద్య ఉద్యోగులకు ఘన సన్మానం

అమలాపురం రూరల్: బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వివిధ హోదాల్లో విధులు పనిచేస్తూ వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయిన వైద్య ఉద్యోగులను పీహెచ్ వద్ద మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వైద్యాధికారిణి గౌతమి ఆధ్వర్యంలో ఈ సన్మాన సభ జరిగింది. డాక్టర్ వాసు నాయక్, డాక్టర్ ఎస్ స్వర్ణకమల, సీహెచ్ఓ కె.శేషుబాబు, పీహెచ్ఎన్ మంగతాయారు, ఎల్టీ ఎం.సుప్రజ, స్టాఫ్‌నర్స్ వై.భారతి, ఎంపీహెచ్ఎస్ రాధా నర్సింహం, ఏఎన్ఎం ఎంపీ రాఘవమ్మ, వీహెచ్ఎస్‌లు ఎం.దేవిరాజేశ్వరి, ఎం.సత్యశ్రీ,నాగలక్ష్మి, కె.విజయ, కె.ఆశలత, సీహెచ్ఓలు పుష్ప, కల్యాణిని ఘనంగా సన్మానించారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు బుద్ధి చెబుదాం

- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిద్దాం
- కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, కుడుపూడి పిలుపు
- ఎంపీ మిథున్‌రెడ్డికి సమావేశం సంఘీభావం



అమలాపురం సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్



ఎంపీ మిథున్‌రెడ్డి చిత్ర పటాలను ప్రదర్శించి సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: అబద్ధాలతో, బూటకపు హామీతో గద్దెనెక్కిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ఇంటింటి వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ'పై మంగళవారం నిర్వహించిన పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత సమావేశానికి డాక్టర్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

చంద్రబాబు మోసాలకు అంతేలేదు

చంద్రబాబు మోసాలకు అంతేలేదని, బూటకపు హామీలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వంత పలికి ప్రజలను నమ్మించారని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలతో ఇచ్చిన బాండు పేపర్లలో పేర్కొన్న హామీలు నెరవేరలేదని అన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం త్వరలో కూలిపోనుందని అన్నారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ రూ.500 కోట్లతో అమలాపురంలో నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుడితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ కళాశాల నిర్మాణ సామగ్రిని వేరే చోటకు తరలించి పేద వైద్య విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి సమావేశం సంఘీభావం

సమావేశంలో మాట్లాడిన నాయకులు ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండించారు. సమావేశం చివర్లో ఎంపీ మిథున్‌రెడ్డి చిత్ర పటాలను పార్టీ నాయకులు ప్రదర్శించారు. కడిగిన ముత్యంలా మిథున్‌రెడ్డి బయటకు వస్తారని నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీల మోసాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పత్రాలను పార్టీ నాయకులు సమావేశంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరి శ్రీనివాసరావు, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, పట్టణ పార్టీ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం నాయకుడు ఉండ్రు బాబ్జి, పార్టీ జిల్లా నాయకుడు కుడుపూడి భరత్ భూషణ్, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, కట్టోజు సన్నాయిదాసు తదితరులు కూటమి పాలనపై ధ్వజమెత్తారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి దంతులూరి రోహిత్‌వర్మ, పార్టీ నాయకులు కల్వకొలను బాబి, ఖ్వాజాబాబు, ఈతకోట శ్రవణ్, మెండు సురేష్‌బాబు,సాగిరాజు సాయిరాజు, కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, బండారు గోవిందు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు

అమలాపురం రూరల్: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను విస్మరించడంపై ప్రజల తరపున ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు సాక్ష్యాలు సృష్టించి అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అమలాపురం వాసర్ల వెంకన్న కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమంపై మంగళవారం పార్టీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ మోసాలను, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా కార్యకర్తలు గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు బీమా చేయించే కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మక తీసుకునేందుకు జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ద్వారా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

దళితులపై దాడులు ఎక్కువయ్యాయి

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు రెండురోజుల క్రితం పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలం వెలవలపల్లికి చెందిన దళిత యువకుడు మహేష్‌ను ఒక రాజకీయ నాయకుడి అనుచరులు బంధించి చిత్రహింసలు పెట్టి కొడుతూ వీడియో చిత్రీకరించడం చాలా దారుణమని అన్నారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సర్యనారాయణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాజ్యాంగ హక్కులను కలరాస్తోందన్నారు. అనంతరం 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, వైస్ ఎంపీపీలు అడపా సుబ్రహ్మణ్యం, పోలమూరి బాలకృష్ణ, నియోజకవర్గ పరిశీలకులు పేరి శ్రీనివాసరావు, పార్టీ అధికారి ప్రతినిధి సుధా గణపతి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన్ గణేష్, రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, విద్యార్థి విభాగం రీజనల్ కోర్డినేటర్ జిల్లెళ్ల రమేష్, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి వెంకటేశ్వరబాబు, జిల్లా మాజీ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, సర్పంచ్‌లు దాసరి అరుణ, చెల్లుబోయిన నాని, పాణకల గణేష్, యుత్ విభాగం అధ్యక్షుడు కేతా భాను, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ, ఎంపీటీసీలు చొల్లంగి సుబ్బిరామ్, గుత్తుల జానకి లక్ష్మి, రేవు శ్రీను, వాసంశెట్టి శ్రీను, దొంగ అంజనేయులు, పరమట నాగమణి, ఊడుం రామకృష్ణ, మెండు నాగలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు ములపర్తి సత్యనారాయణ, నక్కా సంపత్‌కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బూటకపు హామీలకు కేరాఫ్ చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- తాళ్లరేవులో 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం



తాళ్లరేవు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

తాళ్లరేవు: బూటకపు హామీలకు, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలతోపాటు, గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చి ఏ హామీనీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసగించారని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ విమర్శించారు. స్థానిక సూర్యభాస్కర కల్యాణ మండపంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ పరిశీలకుడు మాతా మురళి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పేరిట ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశామని, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అమ్మ ఒడి పథకం అమలు చేస్తే దానిని తల్లికి వందనం అని పేరు మార్చారని, గతేడాది ఈ పథకం అమలుకు ఎగనామం పెట్టారన్నారు. నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాల మాట అటుంచి ఇస్తానన్న నిరుద్యోగ భృతి కూడా ఇవ్వడం లేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి రూ.18 వేలు చొప్పున ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఆ హామీని అమలు చేయడం సాధ్యం కాదని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం దారుణమన్నారు. హామీ ఇచ్చేటప్పుడు తెలియదా అని పొన్నాడ ప్రశ్నించారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తోపాటు ఇచ్చిన 143 హామీలను, వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

పార్టీ రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. పార్టీ తరఫున కూటమి ప్రభుత్వ బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనురాజు, రాష్ట్ర యువత అధికార ప్రతినిధి ఉంగరాల సంతోష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ కోఆర్డినేటర్ మోర్త శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, నాయకులు అంకాడి అంజిబాబు, కాలా వెంకటరమణ, కొపనాతి నాగరాజు, రేవు మల్లీశ్వరి, దడాల జగదీశ్వరరావు, పందిరిపల్లి రాజేష్, కాశి లక్ష్మణస్వామి, బొంతు మోహన్, మోకా మధు, పోతుల రత్నకుమారి, మట్టపర్తి లోవరాజు, వెంటపల్లి వాసంతి, రిటైర్డ్ జేడీ పెట్ల సూర్యనారాయణరాజు, మట్టా లింగమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హామీలు ఇచ్చినప్పుడు ఆర్థిక భారమని తెలియదా?

- మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై డాక్టర్ శ్రీకాంత్ ధ్వజం

అమలాపురం టౌన్: రాష్ట్ర వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలతో కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలను నిలువునా మోసం చేయడానికే హామీలు ఇచ్చారని పూర్తిగా నిర్ధారణ అవుతోందని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పిన మాటలు కూటమి ప్రభుత్వ డొల్లతనాన్ని స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రచార ఆర్భాటంగా హామీలు ఇచ్చేసి ఓట్లు వేయించుకుని ఇప్పుడు ఏరు దాటి తెప్ప తగలేసినట్లుగా ప్రజలను మోసగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు ఆడబిడ్డ నిధి పథకం కింద రూ.1,500 చొప్పున ఇస్తామని అప్పుడు నమ్మబలికి ఇప్పుడు ఆర్థిక భారమని నట్టేట ముంచేస్తారా? అని డాక్టర్ శ్రీకాంత్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు భారమని తెలియదా? హామీలు ఇచ్చినప్పుడు ఓటర్లే కదా అనే చిన్న చూపా? అని డాక్టర్ శ్రీకాంత్ ప్రశ్నించారు.

వైభవంగా సుబ్బాలమ్మ ఊరేగింపు



పట్టణ దేవత సుబ్బాలమ్మకు పూజలు చేస్తున్న బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం బంగారు, వెండి, డైమండ్స్ వర్తకుల సంఘం (బులియన్ అసోసియేషన్) ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ సేవ, ఊరేగింపు కార్యక్రమాలు మంగళవారం వైభవంగా జరిగాయి. తొలుత స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని బులియన్ అసోసియేషన్ కల్యాణ మండపంలో వర్తకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడ నుంచి సుబ్బాలమ్మ దేవస్థానం వరకూ వీధుల్లో భారీ ఊరేగింపుతో అమ్మవారికి చలిమిడి, బెల్లం పానకం, స్వీట్లు, పువ్వులు, వడ పప్పు కావిళ్లతో మేళతాళాలు, గరగ నృత్యాలు, బాణ సంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహించారు. సుబ్బాలమ్మ దేవస్థానం (కొత్త)లో అమ్మవారికి వర్తక ప్రతినిధులు నైవేద్య సమర్పించారు. అనంతరం సమీపంలో ఉన్న పాత సుబ్బాలయమ్మ ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుని పూజలు చేశారు. బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, కార్యదర్శి రాయుడు నాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవ, ఊరేగింపులో మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ్యదాసు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, బులియన్ అసోసియేన్ గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు, మాజీ అధ్యక్షుడు చింతలపూడి సత్తిబాబు, అసోసియేషన్ ప్రతినిధులు దొంగ రాంబాబు, పిండి శేషు, మద్దింశెట్టి ప్రసాద్, మానే ప్రకాష్ పాల్గొని అమ్మవారికి సేవలు చేశారు.

కూటమి పాలనలో దళితులపై దాడులు



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు అధ్యక్షుడు రేవు శ్రీను

ఐ.పోలవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దళితులపై విచక్షణారహితంగా దాడులు పెరిగాయని మాల మహానాడు నాయకులు అన్నారు. మంగళవారం పాత ఇంజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐ పోలవరం మండల మాల మహానాడు అత్యవసర సమావేశం అధ్యక్షుడు రేవు శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలు స్వాహా చేసిన వారిని వదిలేసి మధ్యవర్తిగా ఉన్న దళిత యువకుడు దోనుపాటి మహేష్‌పై విచక్షణారహితంగా దాడిచేసి, గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని రేవు శ్రీను డిమాండ్ చేశారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న అమలాపురంలో ఓ ప్రైవేటు కాలేజీకి సంబంధించిన సిబ్బంది, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుసరులమని చెప్పుకుంటూ ఉద్యోగాలు ఇప్పిస్తామని దందా చేస్తూ అనేకమంది దగ్గర నుంచి రూ.లక్షలు స్వాహా చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని ఒక వ్యక్తి నుంచి రూ.2 లక్షలు తీసుకుని ఉద్యోగం వేయించకపోగా మధ్యవర్తిగా ఉన్న దళిత యువకుడు దోనుపాటి మహేష్‌పై దాడిచేసిన ఎల్లమెల్లి విజయ్, అతనితో పాటు ఉన్న 15 మందిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ దాడిపై స్పందించాలన్నారు.ఈ సమావేశంలో ఒడ్డి గౌతం, మట్టా గగనవీరుడు, కాశి పరివాజ్ కుమార్, రేవు రెడ్డి బాబు, పండు విజయ్‌కుమార్, సాధనాల బాబురావు, నాగ బత్తుల రామకృష్ణ ఎలమంచిలి వాసు, ఎలమంచిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహేష్‌కు దళిత నాయకుల పరామర్శ

అమలాపురం టౌన్: మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరులమని, ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేసిన వారిని దళిత యువకుడు అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దోనిపాటి మహేష్ ప్రశ్నించడంతో అతనిపై ఇటీవల దాడి జరిగింది. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు మహేష్‌కు మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దాడి సమయంలో మహేష్‌తోపాటు అమలాపురం మున్సిపల్ మాజీ ఉద్యోగ శిరసవల్లి ఉదయ్‌శంకర్ ఉన్నాడు. మహేష్‌పై దాడి చేస్తున్నప్పుడు పరారైన ఉదయ శంకర్‌ను పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ పి.వీరబాబు మున్సిపల్ మాజీ ఉద్యోగి ఉదయ్ శంకర్‌ను విచారిస్తున్నారు. వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ బాధితుడు మహేష్‌కు అండగా నిలిచి దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్ చేస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన మహేష్‌ను కోనసీమకు చెందిన దళిత సంఘాల నాయకులు పరామర్శించారు.

మంత్రి సుభాష్ బాధ్యత వహించాలి

ముమ్మిడివరం: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అనుచరులమంటూ కొందరు రౌడీయిజం చేస్తూ పేట్రేగిపోతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ ఆరోపించారు. దోనిపాటి మహేష్‌ను మంత్రి అనుచరులు కిడ్నాప్ చేసి హింసించి కులం పేరుతో దూషించడం హేయమైన చర్య అన్నారు. నిందితులపై హత్యాయత్నం నేరంతో పాటు కిడ్నాప్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని దీనికి మంత్రి సుభాష్ బాధ్యత వహించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లాలో మంత్రి సుభాష్ పేరుతో సెటిల్‌మెంట్లు, దందాలు అధికమవడంతో జిల్లాలో శాంతి భద్రతలు కరువ య్యాయన్నారు. బాధితుడికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు



కొత్తపేట జైలు వద్ద నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అల్లవరం: గోసంగివారిపేటలో మోటారు సైకిల్‌ను దహనం చేశారన్న అనుమానంతో అక్రమ కేసు బనాయించి కొత్తపేట సబ్ జైల్లో రిమాండ్ ఉంచిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మంగళవారం పరామర్శించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని వారికి భరోసా కల్పించారు. మాజీ అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు ముసునూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

ముమ్మిడివరం: త్యాగరాజ గాన సభ 12వ వార్షికోత్సవం మంగళవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. వాయిద్య కళాకారులు త్యాగరాజ స్వామి చిత్ర పటాన్ని ముమ్మిడివరం వీధుల్లో ఊరేగించారు. స్థానిక ఉమా సూరేశ్వరస్వామి, అయ్యప్ప స్వామి ఆలయంలో కళాకారులు, నాదస్వర విద్వాంసులు షేక్ సతార్ సాహెబ్, కోన అప్పారావును ఘనంగా సత్కరించారు. నగర పంచాయతీ కౌన్సిలర్ నరిపెల్ల రామకృష్ణంరాజు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

అమలాపురం టౌన్: ఇంటర్నేషనల్ డే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని గ్రంధి వెంకటేశ్వరరావు మెమోరియల్ హాలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో అమలాపురం విక్టరీ అకాడమి విద్యార్థులు ప్రతిభ చూపారు. క్రీడాకారులు సాధనాల శ్రీసంతోష్, బండారు నానిబాబు, పనిశెట్టి ధరణి వరసగా 3,4,5 స్థానాలను కైవసం చేసుకున్నారని అకాడమి ప్రిన్సిపాల్, కోనసీమ చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకటసురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె



కాట్రేనికోనలో చీర, సారెతో సామూహికంగా ఆయాలకు వెళుతున్న మహిళలు

ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మ అమ్మవారికి మంగళవారం ఆషాఢ సారె సమర్పించారు. గ్రామస్తులు, మహిళలు ముందుగా అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకం, చేసి ఆడపడుచులు తీసుకువచ్చిన పసుపు, కుంకుమ, వడపప్పు, చలివిడి పానకాలు, పట్టు వస్త్రాలు, నిమ్మకాయల దండలు, పలు రకాల స్వీట్లు, పండ్లతో సారెను సమర్పించారు. సమరత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో మేళతాళాలతో బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలేరమ్మతల్లికి..

యానాం: కనకాలపేటలో కొలువైన పోలేరమ్మతల్లికి మంగళవారం మహిళలు ఆషాఢ సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు.

గ్రామ దేవతలకు చీర, సారె సమర్పణ

కాట్రేనికోన: మండలంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మంగళవారం గ్రామ దేవతలకు కుంకుమార్చన అనంతరం చీర, సారెను సమర్పించి ప్రత్యేక పూజలు చేసారు. కాట్రేనికోన మార్కెట్ ప్రాంతంలో భాగిర్థమ్మ, సత్తమ్మ, కనకదుర్గ, మావుళ్లమ్మకు మహిళలు చీర, సారె సమర్పించారు. తిమ్మాపురం, చింతలమెరక విజయ దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు, పండ్లు, మిఠాయిలతో మహిళలు సారెను సమర్పించారు.

బడి బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

అమలాపురం రూరల్: వర్షాలు కురుస్తున్న కారణంగా బడి పిల్లలతో ప్రయాణించే స్కూల్, కాలేజీ బస్సుల డ్రైవర్లు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణాశాఖాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ముఖ్యంగా రోడ్డు మార్జిన్ గమనిస్తూ జాగ్రత్తగా వాహనం నడపాలని సూచించారు. బడి బస్సులను అతివేగంతో సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపితే డ్రైవర్ల లైసెన్స్ సస్పెండ్ చేస్తామని డీటీఓ హెచ్చరించారు. ఇటీవల రాజోలు వద్ద బస్సును వేగంగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్ లైసెన్స్ 30 రోజులు సస్పెండ్ చేశామని తెలిపారు. ఇప్పటికే అన్ని స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలకు మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు తగు భద్రతా సూచనలు తెలియజేశారని పేర్కొన్నారు.